# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 26-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్” కార్యక్రమం ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

2. **బంగాళాఖాతంలో ఏర్పడనున్న ‘మొంథా’ తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.**

3. **కూటమి ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యనతను ఇస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.**

4. **గడిచిన ఏడాదిన్నర కాలంలో 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.**

============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 127వ సంచిక ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

-------------------------

బంగాళాఖాతంలో ఏర్పడనున్న ‘మొంథా’ తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో శ్రవణ మధ్యమ సమావేశం ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తుపాన్ నేపథ్యంలో వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేయడంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్లుండి సాయంత్రం కాకినాడ సమీపంలో ‘మొంథా’ తీవ్ర తుపానుగా మారి తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. ఆ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు, తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

-------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను కాకినాడ పరిసరాల్లో తీరాన్ని తాకే అవకాశం ఉందన్న

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఆదేశించారు. కాకినాడ జిల్లా కలెక్టర్, అధికారులతో శ్రవణ మధ్యమ సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. జిల్లాలో తీరప్రాంతంలో ఉన్న తుని, పిఠాపురం, కాకినాడ రూరల్, అర్బన్ నియోజక వర్గాలతోపాటు తాళ్ళరేవు మండలంపైనా తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉండబోతుందని వాతావరణ శాఖ అంచనా వేసిందని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు.

---------------------------

కూటమి ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యనతను ఇస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా ఇటీవల మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల 347 మంది ఉపాధ్యాయులను నియమించిందన్నారు. ఏలూరు జిల్లా కేంద్రంలోని ఈదర సుబ్బమ్మాదేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు – ఆచంట ఆర్ అండ్ బి రోడ్డను కోటి 50 లక్షల రూపాయలతో సిసి రోడ్డుగా అభివృద్ధి చేసే పనులకు ఆయన నిన్న శంఖుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

గడిచిన ఏడాదిన్నర కాలంలో 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి మాట్లాడుతూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 31 నుంచి వచ్చే నెల 25వ తేదీ వరకూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి సుంకర రాము తెలిపారు. యువతలో ఐక్యత, దేశభక్తి భావాన్ని పెంపొందించే విధంగా జిల్లాలో సర్దార్ @ 150 పేరుతో యూనిటీమార్చ్‌ను నిర్వహిస్తన్నట్లు చెప్పారు. విజయవాడలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..

వాయిస్... 35 సెకన్లు

---------------------------

భారత్, ఆస్ట్రేలియాల మధ్య నిన్న జరిగిన 3వ వన్ డే క్రికెట్ మ్యాచ్ లో భారత్ విజయం సాధించింది. ఆస్ట్రేలియాలోని సిడ్నీ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. 46.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన భారత్ కేవలం 1 వికెట్ నష్టానికి 38.3 ఓవర్లలో 237 పరుగుల లక్ష్యాన్ని చేధించింది. 3 మ్యాచ్ ల సిరీస్ లో తొలి 2 మ్యాచ్ లను భారత్ కోల్పోవడంతో 2-1 తో సిరీస్ చేజార్చుకుంది.

---------------------------

ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతోందని గంటకు 7 కి.మీ వేగంతో కదులుతుందని అమరావతిలోని భారత వాతావరణ సంస్థ తెలిపింది. వాయుగుండం ప్రస్తుతానికి పోర్ట్ బ్లెయిర్‌కి 510 కిలో మీటర్లు, చెన్నైకి 890 కిలో మీటర్లు, విశాఖపట్నంకి 920 కిలో మీటర్లు, కాకినాడకి 920 కిలో మీటర్లు కేంద్రీకృతమై ఉందని వెల్లడించింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ ఈరోజు తీవ్రవాయుగుండంగా, రేపటికి తుపానుగా, ఎల్లుండికి తీవ్రతుపానుగా బలపడుతుందని తెలిపింది. ఎల్లుండి రాత్రికి కాకినాడ సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని పేర్కొంది. తీరము దాటే సమయములో గంటకు 90 నుంచి 110 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపింది. ఈ ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారి ఎం.వెంక్రటావు తెలియజేస్తూ..

వాయిస్.. 20 సెకన్లు

---------------------------

ప్రజలు సోషల్ మీడియా వదంతులను నమ్మొద్దని, అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. అత్యవసర సమాచారం, సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ కంట్రోల్ రూమ్‌లోని టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101ను సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

=====================